క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి జన్మ నక్షత్ర పూజలు



యండమూరులో వెంకటేశ్వరస్వామికి జన్మనక్షత్ర పూజలు, వ్రతాలు చేస్తున్న భక్తులు

కరప: మండలం యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వెంకటేశ్వరస్వామివారి జన్మనక్షత్రం శ్రవణం కలియడంతో ప్రత్యేక పూజాలు నిర్వహించారు. ప్రధానఅర్చకుడు పెద్దింటి సీతారామం ఈ పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులతో వెంకటేశ్వర వ్రతాలు చేయించారు. యండమూరు, పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి, వ్రతాలు చేయించుకుని, స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. కరప విష్ణాలయంలోని వెంకటేశ్వరస్వామికి అర్చకుడు పెద్దింటి అనంతాచార్యులు, కూరాడ, పెనుగుదురు, గురజనాపల్లి, వేళంగి తదితర గ్రామాల్లోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారికి జన్మనక్షత్ర పూజలు చేశారు.

నేడు స్పందన, డయల్ యువర్ కమిషనర్



కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 వరకు డయల్ యువర్ కమిషనర్ నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికంగా ఎదుర్కొనే సమస్యలను కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 0884-2357800కు కాల్ చేసి తెలియజేయవచ్చునన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. అలాగే 10.30 నుంచి స్పందన యథావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



కరపలో పేదలకు దుప్పట్లు అందజేస్తున్న దాతలు

కరప: స్థానిక శివాలయంవీధిలో ఆదివారం దాతలు సమకూర్చిన దుప్పట్లను 100 మందికి రెడ్డి వీరభద్రరావు దంపతులు పంపిణీ చేశారు. ఏటా చలికాలంలో పేదలకు దుప్పట్లు ఇస్తున్నట్టు దాతలు రెడ్డి గంగరాజు, కిరణ్‌కుమార్, మయూర్ జైన్ గుప్తా తెలిపారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, రెడ్డి రాముడు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ రూరల్: వార్షిక మరమ్మతుల నిమిత్తం కాకినాడ గైగోలుపాడు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ జ్యూవెల్ సిటీ ఫీడర్‌పై గల జ్యూవల్ మెడోస్, న్యూ ట్రస్ట్ ఆస్పత్రి, సర్పవరం పూల మార్కెట్, మూడు గుళ్ల సెంటరు, తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం వరకు సరఫరా ఉండదని ఎలక్ట్రికల్ ఈఈ జి.ప్రసాద్ తెలియజేశారు.

భారత సంస్కృతిని తెలుసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నీటి వనరులశాఖ విశ్రాంత ఎస్ఈ సాయికుమార్

బోట్‌క్లబ్: విద్యార్థులంతా మన భారతీయ, సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వ సంపద, జాతీయ కళల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నీటి వనరులశాఖ విశ్రాంత ఎస్ఈ సాయికుమార్ అన్నారు. భారత జాతీయ కళలు, సంస్కృతి, వారసత్వ సంస్థ (ఇంటాక్) తూర్పుగోదావరి చాప్టర్ ఆధ్వర్యంలో ఆదివారం శాంతినగర్ రామకృష్ణ పబ్లిక్ స్కూల్‌లో ప్రాంతీయ స్మారక కట్టడాలపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో నగరంలోని 11 పాఠశాలలకు చెందిన వందమంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మన వారసత్వ సంపద, స్మారక కట్టడాల్లో ఎంతో గొప్పతనం దాగి ఉందన్నారు. ఇంటాక్ జిల్లా కన్వీనర్ వీవీఎల్ఎన్ మూర్తి కాకినాడ పరిసర ప్రాంతాల్లో ఉన్న స్మారక కట్టడాలను తెలియజేశారు. ఇంటాక్ కో కన్వీనర్ వక్కలంక రామకృష్ణ, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు వీఎల్ గాంధీ పాల్గొన్నారు.

షష్ఠి ఉత్సవాలకు సర్వం సిద్ధం



గొర్రిపూడిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం



గొర్రిపూడిలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



కరపలోని 51 అడుగుల సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం



ఇంద్రపాలెంలో సాగుతున్న కల్యాణం

- పలు గ్రామాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీలు
- అన్నదానాలు, గ్రామోత్సవాల నిర్వహణ
- గొర్రిపూడి, వేళంగి, కరప, సిరిపురం గ్రామాల్లో ఉత్సవానికి ఏర్పాట్లు

కరప: మండలంలో తుల్యభాగ నదీతీరాన వెలసిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాన్ని సోమవారం నిర్వహించేందుకు ఆయా గ్రామాల్లోని వంశపారంపర్య ధర్మకర్తలు ఏర్పాట్లు చేశారు. గొర్రిపూడిలో గండి వంశీయులు ఆలయాన్ని నిర్మించగా తర్వాత దాత రావిపాటి సూర్య కళ్యాణరామ్ సహకారంతో పునర్నిర్మించారు. షష్ఠికి ముందురోజు ఇక్కడి స్వామివారికి కల్యాణం చేసి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు. దీనిని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తారు. దేవదాయశాఖ, దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేస్తారు. ఆదివారం సాయంత్రం స్వామికి గ్రామోత్సవం చేసి, రాత్రికి కళ్యాణ ఉత్సవాన్ని ధర్మకర్త, మాజీ ఎంపీటీసీ గండి వెంకట్రాజు, రామావతి దంపతులు నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున 2 గంటల నుంచి పవిత్ర గోదావరి కాలువ స్నానం, స్వామివారి దర్శనం, 19న బుధవారం ప్రాతః కాలాన రక్షవిమోచనం, అవబృదము, రాత్రికి పుష్పోత్సవం నిర్వహిస్తారు. ధర్మకర్త, గొర్రిపూడి గామస్తులు సోమవారం జరిగే షష్ఠి ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. షష్ఠిరోజు ఆర్కెస్ట్రాలు, కోలసంబరం, వెరైటీ బుర్రకథ, వంటి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. షష్ఠి రోజున సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి ఒంటిగంట వరకు భారీ ఎత్తున కరప ప్రసాద్, కాకినాడ మస్తాన్‌లతో పోటాపోటీగా కనులు మిరుమిట్లు గొలిపేలా బాణసంచా కాలుస్తారన్నారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చీకాల సుబ్బారావు తదితర గ్రామపెద్దలు, వివిధ పార్టీల నాయకులు షష్ఠి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి తదితర ప్రజా ప్రతినిధులను, పారిశ్రామికవేత్తలను ఆహ్వానించినట్టు నిర్వాహకులు తెలిపారు. కరపలో చాగంటి వంశీయులు నిర్మించిన ఆలయంలో వంశపారంపర్య ధర్మకర్త చాగంటి వెంకట్రావు, వేళంగిలో వంశపారంపర్య ధర్మకర్త మెర్ల వీరయ్యచౌదరి ఆయా గ్రామాల్లోని వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయాల్లో పందిళ్లు వేసి విద్యుద్దీపాలతో అలంకరించి భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. సిరిపురం శివాలయంలో కూడా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఉంది, అక్కడకూడా షష్ఠి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కాకినాడ-రావులపాలెం ప్రధాన రహదారిలో కరప, పెనుగుదురు గ్రామాల మధ్య సిరిపురం గ్రామస్తుడు, వ్యాపారవేత్త చిక్కాల దొరబాబు, సుబ్బారావు సోదరులు సొంత ఖర్చుతో నిర్మించిన 51 అడుగుల సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం వద్ద షష్ఠి రోజున కాకినాడ శ్రీపీఠం పరిపూర్ణానందస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అదే రోజున ఉదయం 11 గంటల నుంచి అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు దొరబాబు సోదరులు తెలిపారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం

కాకినాడ రూరల్: మండలంలోని ఇంద్రపాలెంలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. షష్ఠి ఉత్సవాల్లో భాగంగా ఆలయ ఈఓ జోగా సత్యనారాయణ పర్యవేక్షణలో అర్చకులు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దివ్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు ఇంద్రపాలెం, తమ్మవరం గ్రామాల్లో ఉత్సవాలు

సుబ్రహ్మణేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాల కోసం ఇంద్రపాలెం, తమ్మవరం గ్రామాల్లో ఆలయాలు ముస్తాబయ్యాయి. తెల్లవారు జాము నుంచి అభిషేకాలు, దర్శనాలకు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడంతో భారీ ఏర్పాట్లు చేశారు.



విద్యుత్ కాంతులతో శోభాయమానంగా ఉన్న ఇంద్రపాలెం సుబ్రహ్మణ్యేశ్వర ఆలయ ముఖద్వారం

మోగిన నెల గంట

- ప్రారంభమైన ధనుర్మాసం
- విష్ణాలయాల్లో ఘనంగా పూజలు



కరప విష్ణాలయంలోని వేణుగోపాలస్వామి

కరప: నెలగంట మోగింది. పల్లెల్లో సంక్రాంతి సందడి మొదలైంది. ధనుర్మాసం రాకను స్వాగతిస్తూ ప్రతి ఇంటా ముత్యాల ముగ్గులు కొలువు తీరాయి. తెల్లవారుతూనే హరిదాసుల మేలుకొలుపు, హరివిల్లులు, డూడూ బసవన్నల విన్యాసాలు, పిడకల వేటలో చిన్నారులు, కోడిపందాలకు పెద్దలు సన్నాహాలు మొదలుపెట్టారు. ఆదివారం నుంచి గ్రామాల్లో ధనుర్మాసం ప్రారంభం కాగా, విష్ణాలయాల్లో పూజలు ప్రారంభించారు. భక్తితో దైవాన్నే పతిగా పొందిన గోదాదేవి తన కోరిక నెరవేర్చుకున్న పుణ్యమాసం ధనుర్మాసమని స్థానిక విష్ణాలయం ప్రధాన అర్చకుడు పెద్దింటి అనంతాచార్యులు తెలిపారు. భోగిరోజున గోదాదేవి కళ్యాణంతో ధనుర్మాసం ముగుస్తుందన్నారు. అలాగే ఈ నెల 23న వైకుంఠ ఏకాదశని, దీనినే ముక్కోటి ఏకాదశి అనికూడా వ్యవహరిస్తారని ఆయన చెప్పారు. యండమూరులో సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసపూజలు ప్రారంభించినట్టు సీతారామాచార్యులు తెలిపారు. కొంగోడు, పెనుగుదురు, కూరాడ, జెడ్.భావారం గ్రామాల్లోని విష్ణు, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ధనుర్మాసం నెలరోజులు స్వామివార్లకు తెల్లవారుజామునే పూజా కార్యక్రమాలు నిర్వహించి, నైవేద్యం సమర్పిస్తామని అర్చకులు తెలిపారు. ప్రతిరోజు సుప్రభాతసేవ, తీర్థపు బిందె, తిరుప్పావై ప్రవచనాలు వంటి పూజలు జరుగుతాయని అర్చకులు తెలిపారు.

ప్రతి హిందువుకూ అయోధ్య పూజాక్షతలు

- స్వామి నిత్యానంద సరస్వతి
- వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు



అయోధ్య రాముని అక్షతలు, రామాలయం ఫొటోలు, కరపత్రాలతో మండల శ్రీరామ భక్తులు, అయోధ్య తీర్థ క్షేత్ర ప్రతినిధులు

బోట్‌క్లబ్: శ్రీరాముడి ఆశీస్సులు అందరికీ అందాలని, అందుకోసం అయోధ్య నుంచి వచ్చిన ప్రత్యేక పూజాక్షతలు వారికి అందజేయాలని స్వామి నిత్యానంద సరస్వతి అన్నారు. స్థానిక బాలాజీచెరువుసెంటర్‌లో ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో అయోధ్య రామ మందిర అక్షతలు, శ్రీరామ మందిర చిత్ర పటాలు, ఆహ్వాన పత్రాలు చేరుకున్నాయి. వీటిని విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్‌ల ఆధ్వర్యంలో స్థానిక భక్తులు ఆదివారం తలపై పెట్టుకుని భారీగా ఊరేగింపు నిర్వహిస్తూ టీటీడీ కల్యాణ మండపానికి చేర్చారు. నగరం, రూరల్‌లో ఉన్న అన్ని ఆలయాలకు వీటిని అందజేశారు. స్వామి నిత్యానంద సరస్వతి మాట్లాడుతూ ప్రతి దేవాలయంలో ఐదు వందల కుటుంబాలకు అక్షింతలు అందజేసేందుకు ఆలయ కమిటీకి ఐదు కిలోల అక్షింతల బ్యాగ్‌లు అందజేస్తున్నామన్నారు. దేశమంతటా ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆయా ఆలయ కమిటీ సభ్యులకు బ్యాగులు, చిత్రపటాలు, ఆహ్వాన పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ సోము, ఆర్ఎస్ఎస్ కాకినాడ అధ్యక్షుడు ఆదిత్యశర్మ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, నగర కన్వీనర్ గట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

నడకుదురుకు..

కరప: అయోధ్య రామాలయం నుంచి అక్షింతలు, రామాలయం ఫొటోలు, కరపత్రాలు మండలం నడకుదురులోని దుర్గాదేవి ఆలయానికి ఆదివారం చేరుకున్నాయి. మండల పరిధిలోని 23 గ్రామాల నుంచి శ్రీరామభక్తులతో కలసి రెవెన్యూ మండల కార్యనిర్వాహకులు ఎన్‌పీవీ రామారావు, పలివెల శ్రీధర్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 31వ తేదీ వరకు వాటికి పూజలు చేయాలని వారు తెలిపారు. వీటిని జనవరి ఒకటి నుంచి 7వ తేదీ వరకు ఇంటింటికీ పంపిణీ చేయాలని శ్రీరామజన్మభూమి తీర్థ యాత్ర అయోధ్య ప్రతినిధులు తెలియజేశారు.



అయోధ్యరాముని పూజాక్షతల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న స్వామి నిత్యానంద సరస్వతి

విశ్వహిందూ పరిషత్ ప్రతినిధి వెలుగుబంట్ల శ్రీనివాస్, పెద్దాడ సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు త్వరలో ఇళ్ల స్థలాలు

- ప్రెస్‌క్లబ్ నిర్వహణ కోసం భవనం
- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం త్వరలోనే ఇళ్ల స్థలాలను మంజూరు చేయనుందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. స్థానిక గంగనాపల్లిలో కాకినాడ సిటీ, రూరల్ జర్నలిస్టులకు కాకినాడ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మంగ వెంకట శివరామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన వన సమారాధనలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుందని, త్వరలోనే స్థలాలు పంపిణీ చేసేందుకు సీఎం జగన్ చర్యలు తీసుకుంటారన్నారు. జర్నలిస్టులకు తన వంతు తోడ్పాటు ఉంటుందని హామీ ఇచ్చారు. అలాగే ఎంతో కాలంగా ప్రెస్‌క్లబ్ భవనాన్ని ఈ నెల 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ప్రారంభించేందుకు నిర్ణయించానన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు సందడి చేశారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు రాగిరెడ్డి సుబ్బారావు, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



అరట్లకట్టలో ఉచిత గ్యాస్ కనెక్షన్ అందజేస్తున్న సర్పంచ్, బీజేపీ నాయకులు

కరప: పేదల అభ్యున్నతికి ప్రధాని మోది నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల బీజేపీ అధ్యక్షుడు రెడ్డి రమణేశ్వర్ కోరారు. మండలం అరట్లకట్టలో ఆదివారం సర్పంచ్ గోపి సత్యవేణి అధ్యక్షతన జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమపథకాలు ఎవరికైనా రాకపోతే, అర్హులైనవారిని గుర్తించి వారికి అందజేసేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మండల ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ అన్న యోజన, దీన్‌దయాళ్ అంత్యోదయ, ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, కిసాన్ సమ్మాన్ వంటి 20 పథకాలను కేంద్రప్రభుత్వం అమలుచేస్తోందన్నారు. దేశ నాయకుల వేషధారణతో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ఉచిత గ్యాస్‌కనెక్షన్లు, ఆయుష్మాన్‌భవ కార్డులు తదితర పథకాలను లబ్ధిదారులకు అందజేశారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సోడగం సూరిబాబు, వికసిత్ భారత సంకల్ప యాత్ర కో ఆర్డినేటర్ పుట్టా వీరప్రసాద్‌గాంధీ, వి.ముత్యాలరావు, గ్రామ కార్యదర్శి వి.సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక నేత నూకరాజుకు సత్కారం



పితాని నూకరాజు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తదితరులు

కాకినాడ సిటీ: కార్మికులు, యాజమాన్యాల ప్రయోజనాల కోసం పాటుపడే వారే నిజమైన నాయకులు అవుతారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. కార్మిక నాయకుడిగా 25 ఏళ్లు పూర్తిచేసుకున్న పితాని నూకరాజును స్థానిక సూర్య కళామందిర్‌లో కాకినాడ పోర్టు స్టీవ్‌డోర్స్ స్టాఫ్ వర్కర్స్ యూనియన్, పలు షిప్పింగ్ కంపెనీల యాజమాన్యాల ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి ముఖ్యఅతిథిగా హాజరై నూకరాజు నిజమైన కార్మిక నాయకుడిగా చరిత్రలో నిలిచిపోతారన్నారు. పోర్టు కార్యకలాపాలు దినదిన అభివృద్ధి చెందుతూ ఉన్నాయంటే దానికి ప్రత్యక్ష కారకులు కార్మికులేనన్నారు. వారి మంచి చెడులు ఆలోచించి సమన్వయం చేసుకోవడం కష్టతరమైన బాధ్యత అన్నారు. నూకరాజు 25 ఏళ్లు పాటు కార్మిక నాయకుడిగా నిలబడి నేటికీ సేవలు అందించడం అభినందనీయమన్నారు. సీఎం జగన్ హయాంలో రాష్ట్రంలో కొత్త పోర్టులు వచ్చాయని, కాకినాడ పోర్టు నుంచి బియ్యం ఎగుమతులు అధికంగా జరుగుతున్నాయన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ముందుంటానని ఆయన పేర్కొన్నారు. కంటిపూడి సర్వారాయుడు, రామచంద్రరావు, గుబ్బల తులసికుమార్, చంద్రశేఖర్ కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, నగర వైఎస్సార్ సీపీ అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మహేష్, గెద్దాడ వెంకటేశ్వరరావు, కాకినాడ చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు వారణాసి వీరరాఘవులు తదితరులు పాల్గొని పితాని దంపతులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

పింఛన్ పొందడం ప్రాథమిక హక్కు

కాకినాడ రూరల్: ఏళ్ల తరబడి జీవితాన్ని వృత్తికే అంకితం చేసి శేష జీవితాన్ని ఆనందంగా గడిపేందుకు సామాజిక భద్రత రీత్యా పింఛన్ పొందడం ప్రాథమిక హక్కు అని విద్యుత్ శాఖ విశ్రాంత ఎస్ఈ అడ్డాల వీరభద్రరావు పేర్కొన్నారు. జాతీయ పింఛన్ దారులు దినోత్సవం సందర్భంగా రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వీరభద్రరావు దంపతులను అడబాల రత్న ప్రసాద్ తదితరులు సన్మానించారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ వృద్ధాప్యంలో పలు రకాల అనారోగ్యంతో రుగ్మతలు సంభవిస్తాయని పింఛన్ సౌలభ్యం ఉంటే భద్రత ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, న్యాయవాది ఎనుముల రామం, శ్రీనగేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

కాకినాడ క్రైం : కాకినాడ డెయిరీ ఫాం సెంటర్‌లో ఓ ఆర్ఎంపీ వైద్యుడు నిర్వాకంతో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు నగరంలోని సాంబమూర్తినగర్‌కు చెందిన (55) ఏళ్ల వ్యక్తి రక్తపోటు, మధుమేహంతో బాధ పడుతున్నాడు. వైద్యం కోసం డెయిరీ ఫాంలో ప్రాక్టీస్ చేస్తున్న ప్రసాద్ అనే ఆర్ఎంపీని ఆశ్రయించాడు. వైద్యంపై పూర్తి పట్టులేని ప్రసాద్ ఆదివారం సాయంత్రం సదరు వ్యక్తికి ఇంజెక్షన్ చేశాడు. అలా చేసిన కొద్దిసేపటికే ఆకస్మిక గుండెపోటుతో కుప్పకూలాడు. ఆపై కాసేపటికి మృతిచెందాడు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు ఆర్ఎంపీ క్లినిక్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

బీసీల్లో రాజకీయ చైతన్యం రావాలి



వన సమారాధన వేదికపై పాల్గొన్న నాయకులు

కాకినాడ సిటీ: బీసీలలో సామాజిక స్పృహ, రాజకీయ చైతన్యం తీసుకువచ్చే విధంగా ఏర్పాటు చేసిన బీసీ కులాల ఆత్మీయ వన సమారాధన విజయవంతమైందని వేదిక నాయకులు చొల్లంగి వేణుగోపాల్ పేర్కొన్నారు. మెక్లారిన్ గ్రౌండ్స్‌లో జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో ఉన్న 43 బీసీ కులాలకు చెందిన ప్రజలు ఈ వన సమారాధనలో పాల్గొన్నారు. జనాభా నిష్పత్తిలో అత్యధిక శాతం కలిగి ఉన్న బీసీలను పాలకులు ఓటు బ్యాంకుగా గుర్తించడం తప్ప రాజ్యాధికారానికి మాత్రం దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో ఇదే ఐక్యతతో బీసీలంతా ముందుకు సాగితే అగ్రవర్ణ రాజకీయాల ఆటలు కట్టించవచ్చని దానికి నాంది ఇక్కడి నుంచే పలకాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నులుకుర్తి వెంకటేశ్వరరావు, మాకిరెడ్డి భాస్కర్‌గణేష్, గుబ్బల తులసీకుమార్, మల్లాడి రాజు, పప్పు దుర్గాప్రసాద్, కుండల సాయికుమార్, సుందరపల్లి గోపాలకృష్ణ, రాయుడు నాగేశ్వరరావు, కొక్కిరిగడ్డ గంగరాజు, వుయ్యూరి నాని, టీఎల్ గణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ కళాశాల అభివృద్ధికి సహకరిస్తా



పూర్వ విద్యార్థుల సంఘ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- ఘనంగా పూర్వ విద్యార్థుల సమావేశం

బాలాజీచెరువు: చరిత్ర కలిగిన పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం కళాశాలలో నిర్వహించారు. కళాశాలలో రోడ్లు నిర్మించాలని పూర్వ విద్యార్థుల సంఘం విన్నవించగా ప్రభుత్వం గడగడపకు కార్యక్రమంలో భాగంగా వార్డుకు రూ.20 లక్షలు కేటాయించారని ఇందులో అవకాశం ఉంటే రోడ్లు నిర్మించేలా అధికారులకు సూచిస్తానన్నారు. అలాగే అసంపూర్తిగా ఉన్న ఆడిటోరియం అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ద్వారంపూడిని సత్కరించారు. పూర్వవిద్యార్థుల సంఘ గౌరవ అధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, అధ్యక్షుడు ఎస్‌వీ గోపాలనరసరాజు, కార్యదర్శి సత్యస్వరూప్, సభ్యులు వైఎస్ఎన్ మూర్తి, గొడవర్తి సత్యమూర్తి, మల్లిపూడి శ్రీనివాసరావు, ఉషారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ పి.వెంకటలక్ష్మి, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి పాల్గొన్నారు.

ఉత్సాహంగా భగవద్గీత పోటీలు



పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

బోట్‌క్లబ్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు ఉత్సాహంగా ముగిశాయి. ప్రఖండ స్థాయి భగవద్గీత కంఠస్థ పోటీల్లో విజేతలకు జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. అన్ని ప్రఖండల్లోను విజేతలుగా నిలిచిన వారు ఈ పోటీల్లో పాల్గొన్నారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, కళాశాల స్థాయిలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల కన్వీనర్ గరిమెళ్ల అన్నపూర్ణయ్య శర్మ భగవద్గీత పఠనంతో కలిగే ప్రయోజనాలు వివరించారు. భగవద్గీతలో వ్యక్తిత్వ వికాసం, విజ్ఞానం, ఆధ్యాత్మికం జ్ఞానం ఉందన్నారు. పోటీల్లో విజేతలు ఈ నెల 25న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు చెప్పారు. పోటీల్లో విజేతలకు పిల్లి తిరుపతిరావు, మానికిరెడ్డి సత్యనారాయణ, రవిశంకర్ పట్నాయక్ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉదయ భానోజీరావు, శ్రీకృష్ణవాణి, గ్రంధి నాగమణి పాల్గొన్నారు.